క్లుప్తంగా

సేవలు అభినందనీయం

మరికల్: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల కోసం మజ్జిగను అందజేస్తున్న యువక మండలి సేవలు అభినందనీయమని ఎస్‌ఐ మురళీ అన్నారు. గురువారం పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులకు ఎస్‌ఐ మజ్జిగను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రవికిరణ్, రఘు, చెన్నయ్య, సభ్యులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు చెందిన టీవీ కళాకారుడు తిమోత్రిని కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సన్మానించారు. ఈయన పలు సీరియల్లలో నటించాడు. కార్యక్రమంలో రవికుమార్, మోహన్‌రెడ్డి, అశోక్, జలాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు సరికాదు

ధన్వాడ: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి బీజేపీపై ఆరోపణలు చేయడం సరికాదని పార్టీ మీడియా సెల్ కోకన్వీనర్ ఉమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఫోన్లు చేసి ఓట్లు అడుగుతున్నారని చెప్పడం సరైంది కాదన్నారు.

టెంట్‌హౌస్ సామగ్రికి నిప్పు

దామరగిద్ద: మండలంలోని ఆశన్‌పల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో టెంట్‌హౌస్ కాలి దగ్ధమైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వసంత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపూర్ చెందిన పరిపూర్ణం టెంట్‌హౌస్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. గ్రామ సమీపంలోని గురుమందిర్ మంటపంలో టెంట్‌హౌస్ సామగ్రిని నిల్వ చేశారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి నిప్పంటించారు. మంటలు చెలరేగడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు మంటలు ఆర్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజే బాక్స్‌లు, టెంట్‌లు, వంట పాత్రలు, కుర్చీలు తదితర దాదాపు రూ.8 లక్షల విలువైన సామగ్రి నష్టపోయినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఎస్‌ఐ ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో పార్టీకి డబుల్ డిజిట్ ఖాయం

నారాయణపేట రూరల్: రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో డబుల్ డిజిట్‌లో ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమని సీనియర్ నాయకులు నాగురావునామాజి, రతంగపాండురెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ పీఎంగా మోదీ రికార్డు సృష్టిస్తారని జోస్యం చెప్పారు. దేశ వ్యాప్తంగా కమలం పార్టీకి ఓటు వేయాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలిని గాయపరిచిన వ్యక్తిపై కేసు

దామరగిద్ద: రోడ్డు పక్కన ఆగి ఉన్న ఓ వృద్ధురాలిని బైక్‌తో ఢీకొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వసంత్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. లింగారెడ్డి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం ఆటో దిగి డబ్బులు చెల్లిస్తున్న సమయంలో యానగుంది వైపు నుంచి వస్తున్న శివప్ప వృద్ధురాలు ఎల్లమ్మను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ఉడ్మల్‌గిద్దకు చెందిన మరో వ్యక్తి బుగ్గేష్‌కు స్వల్ప గాయలయ్యాయి. బాధితులు ఫిర్యాదు మేరకు శివప్పపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్, కారు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

మాగనూర్: బైక్, కారు ఢీకొన్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వెంకటయ్యగౌడ్ నల్లగట్టు సమీపంలో హోటల్ నడిపిస్తున్నాడు. గురువారం రాత్రి వెంకటయ్యగౌడ్ బైక్‌పై ఇంటికి వస్తుండగా, హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని మాన్వి పట్టణంకు వెళ్తున్న కారు స్థానిక పెట్రోల్‌బంక్ వద్దకు రాగానే బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో ద్విచక్రవాహనంపై ముగ్గురు ఉండగా అందులో వెంకటయ్యకు కాళ్లు విరిగి గాయాలు కాగా, మిగతా వారికి స్వల్పగాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో కారులో ఐదుగురు ఉండగా వారిలో ఓ మహిళకు చేతికి గాయమైంది. వారిని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించగా, వెంకటయ్యను మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు.

ప్రత్యేక ప్రార్థనలు

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసం మొదటి దశకం పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు స్థానిక ఇమాదుల్ ఉలూమ్ మదర్సా మసీదులో ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ మాసంలోని తరావిహ్ నమాజ్ ముఖ్యమైనది, ప్రతి రోజు రాత్రి ఇషా నమాజ్ తర్వాత చదివే తరావిహ్ నమాజ్‌లో దివ్య ఖురాన్ పఠిస్తారు. మదర్సా మసీద్‌లో ప్రతి రోజు తరావి నమాజ్‌లో దివ్వ ఖురాన్‌లోని మూడు పారాలు (భాగాలు) చదివి వినిపించారు. ఈ సందర్భంగా హాఫీజే ఖురాన్‌లకు స్థానికులు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

దిష్టిబొమ్మల్లా వైకుంఠధామాలు

- నిర్మించి ఉపయోగం లేని తీరు
- పాత పద్ధతి ప్రకారమే ఖననం
- చెరువులు, వాగుల పక్కన నిర్మాణాలు
- ముంపునకు గురవుతున్న వైనం



పెచ్చులూడిన వైకుంఠధామం పైకప్పు



ఇబ్రహీంపట్నం చెరువు వద్ద నిర్మించిన వైకుంఠధామం

మరికల్: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాల నిర్మాణాలకు పలు చోట్ల సరైన ప్రదేశాలు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. స్థానిక పాలకులు, అధికారులు స్థలాల ఎంపికలో ముందుచూపుతో వ్యవహరించకపోవడంతో చెరువు నీటిలో ముంపునకు గురవుతున్నాయి. మరికొన్ని చోట్ల సరైన సౌకర్యాలు లేక పనికి రాకుండాపోతున్నాయి. ఫలితంగా రూ.లక్షల ప్రజాధానం వృథా అవుతుంది. సాధారణంగా వ్యక్తి మరణిస్తే మృతదేహాన్ని చాలా గ్రామాల్లో ఖననం చేస్తుంటారు. కొన్ని కులాలు మాత్రమే దహనం చేస్తారు. వైకుంఠధామాలు, దహనానికి అనుకూలంగా నిర్మించామని అధికారులు, పాలకులు చెబుతున్నా వాటిని ఉపయోగించుకోలేకపోవడంతో అవి దిష్టబొమ్మల్లా మారాయి.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 280 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో వైకుంఠధామాలకు రూ.33.60 కోట్లు, ప్రకృతి వనాలకు స్థలాలను బట్టి నిధులు ఖర్చు చేశారు. మొత్తం పనులకు రూ. 50 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అవి ప్రజలకు బాగా ఉపయోగంలోకి వచ్చేవే.. అయినా స్థలాల ఎంపికలో లోపించిన ముందుచూపు కారణంగా సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువులు, వాగుల సమీపంలో నిర్మించడంతో ముంపునకు గురవుతున్నాయి. చెరువుకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఉంటాయి. హద్దులు దాటి స్థలాలను గుర్తిస్తే సరిపోయేది. ఇలాంటి నిబంధనలు పట్టించుకోకుండా నిర్మించడంతో కొద్దిపాటి నీరు చేరితే జలమయం అవుతున్నాయి. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో ఒక మృతదేహం కూడా దహనం చేయకముందే పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి.

నిర్మాణాలు ఎక్కడెక్కడ

- ధన్వాడ మండలంలోని ఎమ్మోనిపల్లిలో మన్నె వాగు సమీపంలో వైకుంఠధామం, డంపడింగ్ యార్డు నిర్మించారు. ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని వాగు దాటి తీసుకెళ్లాల్సిస్తోంది.
- కోస్గి, మద్దూరు మండలాల్లో సైతం వాగుల పక్కన నిర్మించడంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారిపోయింది. ముంగిమల్లలో వాగు పక్కనే వైకుంఠధామం నిర్మించారు.
- మక్తల్ మండలం జక్లేర్‌లో వైకుంఠధామాన్ని ఊర చెరువులో నిర్మించారు. వర్షాకాలం వస్తే మునిగిపోతుంది. దహన సంస్కారాలకు ఇబ్బంది పడుతున్నారు. దాసర్‌దొడ్డికి రెండు కిలోమీటర్లు దూరంలో నిర్మించి బోరు వేశారు. నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి.
- మరికల్ మండలం ఇబ్రహీంపట్నంలో డంపింగ్‌యార్డు, వైకుంఠధామాలను చెరువుల పరిధిలో నిర్మించారు.
- మద్దూరు మండలంలోని హాజీపూర్‌లో ప్రకృతి వనాన్ని పెద్దపాడులో రైతు వేదిక, లింగల్‌చేడులో వైకుంఠధామాన్ని చెరువులు, వాగుల పక్కన నిర్మించారు. చెరువుల్లో నీరు చేరితే వాటి వద్దకు వెళ్లే వీలుండదని ప్రజలు వాపోతున్నారు.
- కృష్ణాలో నది పక్కనే శ్మశానం ఉండటంతో వరదలు వస్తే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- ఊట్కూర్‌లో పెద్ద చెరువు పక్కనే వైకుంఠధామం ఏర్పాటు చేశారు. వీటిని ఉపయోగంలో తీసుకరావడం కోసం అధికారులు ప్రయత్నం చేస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు.

సిరి ధాన్యాలతో ఆరోగ్యం పదిలం



రాయికోడ్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ

నర్వ: మహిళలు సిరి ధాన్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ సరోజిని అన్నారు. గురువారం మండలంలోని రాయికోడ్, ఉందేకోడ్, నర్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పోషణ్‌మాసోత్సవాలలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన చిరుధాన్యాలతో తయారు చేసిన వంటల స్టాల్‌లను పరిశీలించారు. చిరుధాన్యాల తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గుతుందన్నారు. రక్తహీనత వల్ల కలిగే అనారోగ్యాలతో జాగ్రత్తగా ఉండి నిత్యం పోషకాహారంతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు చేయించారు. మహిళలచే పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ సరోజిని, సూపర్‌వైజర్ అరుణ, బాలాజీ, మహిళలు పాల్గొన్నారు.

మొబైల్‌ఫోన్ అప్పగింత



మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగిస్తున్న ఎస్‌ఐ కురుమయ్య

నర్వ: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ గుర్తించ బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. గురువారం రాత్రి నర్వకు చెందిన రాఘవేందర్‌రెడ్డికి మొబైల్ ఫోన్ అందించినట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. మొబైల్‌ఫోన్‌లు పోగుట్టుకున్న బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. తద్వారా మొబైల్‌ఫోన్‌లను గుర్తించి అప్పగిస్తామన్నారు.

వెయ్యి బీడీలకు రూ.350 కూలి ఇవ్వాలి



మాట్లాడుతున్న వెంకటేష్

ధన్వాడ: వెయ్యి బీడీలకు రూ.350 కూలి ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకుడు వెంకటేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. 20 వేల మంది బీడీ కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని, దశాబ్దాలుగా వారికి కార్మిక చట్టాలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. చాలీచాలని వెయ్యి బీడీలకు కేవలం రూ.207 మాత్రమే పొందుతున్నారని తెలిపారు. అందుకే శుక్రవారం చలో చిన్నచింతకుంట కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో కార్మికులు పాల్గొనాలని కోరారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



ఆలంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్

కృష్ణా: మండలంలోని ఆలంపల్లిలో రెండేళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలతో నిండిపోయి.. వైర్లు ఎక్కడికక్కడ వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోని వీధి దీపాలు రాత్రి పగలు వెలుగుతూనే ఉంటాయని, వాటిని పగలు బంద్ చేయాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని బంద్ చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం



మాట్లాడుతున్న విజయలక్ష్మి

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి సౌజన్య, విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని బువ్వమ్మదర్గా ఏరియాలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా మహిలా లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. సమాజంలో సగభాగమైన మహిళల హక్కుల సాధనతో పాటు లింగ వివక్షత, సమానత్వ సాధనకు కృషి చేద్దామన్నారు. మోదీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేద్దామన్నారు. దేశంలో చోటు చేసుకుంటున్న పరువుహత్యలు, కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారిపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. సమావేశంలో సునీత, మంజుల, సత్తెమ్మ, కాశీనాథ్, నర్సింహ, నారాయణ, సాధిక్, అంజి, నజీర్, తాయర్, శ్రీకాంత్, అఖిల్, ఆశ, మాహేశ్వరి పాల్గొన్నారు.

పల్లెకురాని 'పల్లెవెలుగు'



ప్రైవేట్ వాహనంలో వెళ్తున్న వర్కూర్ గ్రామస్తులు

- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- ప్రజలకు తప్పనితిప్పలు

మాగనూర్: రోడ్డు ఉన్న ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాం కల్పిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా మాటలు నీటి మీద రాతలుగానే మారుతున్నాయి. నేటికి మండలంలో అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా మండలంలోని వర్కూర్ మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు విన్నపాలకు ఫలితాలు లేకుండా పోయాయి. మండల కేంద్రం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. మండల కేంద్రానికి కూత వేటు దూరంలోనే ఉన్న వర్కూర్‌కు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వర్కూర్ నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఆటోలు, జీపులలో ప్రయాణికులు నిండేదాక వాహనం కదలదు. గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.

ప్రమాదమని తెలిసినా

ప్రైవేట్ వాహనాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రమాదం అని తెలిసిన గత్యంతరం లేక ప్రయాణిస్తున్నారు. విద్యార్థులకు, ఉద్యోగులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి పాఠశాల, కళాశాలకు చేరుకోలేకపోతున్నారు. సమయం వృథాతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నారు.

సమయానికి వెళ్లలేకపోతున్నాం..



మాగనూర్ మండల కేంద్రానికి చదువుకోవడం కోసం నిత్యం ప్రయాణించాల్సిన అవసరం ఉంది. కానీ సరైన రవాణా సదుపాయం లేక ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నాం. నిత్యం గ్రామం నుంచి మండల కేంద్రంకు కాలినడకనే వెళాల్సి వస్తుంది. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి. – మహదేవ్, విద్యార్థి, వర్కూర్

బస్ సౌకర్యం కల్పించాలి



ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం గ్రామం నుంచి మాగనూర్, మక్తల్, నారాయణపేట ప్రాంతాలకు వెళ్తుంటాం. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నిత్యం ప్రైవేట్ వాహనాలు దిక్కుగా మారాయి. అధికారులు స్పందించి వర్కూర్ నుంచి బస్ సౌకర్యం కల్పించాలి. – నర్సింహ, వర్కూర్

త్వరలో అదనపు బస్సులు



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాగనూర్ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని తమ దృష్టికి తీసుకొచ్చారు. ఆ విధమైన ప్రతిపాదనలు మేము ఉన్నతాధికారులకు పంపించాం. అతి త్వరలో అదనపు బస్సులను ఆయా గ్రామాలకు కల్పిస్తాం. – లక్ష్మిసుధా, డీఎం, నారాయణపేట

మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఎన్‌హెచ్-167 పక్కన మిషన్ భగీరథ పైపులైన్ పగిలి చెరువులోకి వృథాగా నీరు పోతుందని 19న సాక్షి దినపత్రికలో 'వృథాగా మిషన్‌భగీరథ నీరు' కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. గురువారం ప్రధాన పైపులైన్‌కు మరమ్మతు చేపట్టారు. దీంతో ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలాలకు తాగునీటి ఇబ్బందులు తొలగనున్నాయి.



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

ఎద్దులబండి పోటీలు ప్రారంభం



ముస్లాయిపల్లి వద్ద పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: మండలంలోని ముస్లాయిపల్లిలో కృష్ణానది అవతల ఉన్న నారదగడ్డ చెన్నకేశవస్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఎద్దులబండి పోటీలను గురువారం ప్రారంభించారు. అనంతరం పక్కనే ఉన్న రాంలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. కృష్ణానదిలో బోటులో ప్రయాణించి నారగడ్డ జాతరకు వెళ్లి అక్కడ ఆలయంలో చెన్నకేశవుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, ఎంపీపీ హన్మంతు, విష్ణువర్ధన్‌రెడ్డి, తాయప్ప, నాగిరెడ్డి, శివారెడ్డి, గోవిందు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

దామరగిద్ద: మండలంలోని ఉద్మల్‌గిద్దలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. దేశాన్ని లౌకిక ప్రజాస్వామ్య దేశంగా నిలబెట్టేందుకు తన జీవితాన్ని దారపోశాడన్నారు. సమ సమాజ నిర్మాణ ప్రధాన విగ్రహాన్ని గ్రామంలో ప్రతిష్ఠించేందుకు కేవీపీఎస్ నాయకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, మల్లేష్, హన్మంతు, గోపాల్, బుగ్గప్ప, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.



భూమి చేస్తున్న నాయకులు

శాంతిభద్రతల పరిరక్షణకే ఫ్లాగ్‌మార్చ్



ముడుమాల్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కృష్ణా: మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గుడెబల్లూర్, ముడుమాల్‌లో గురువారం కేంద్ర సాయుధ బలగాలతో స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నవీద్ మాట్లాడుత.. ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఆదేశాల మేరకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రధానంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరడంతో పాటు ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించుటకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

మక్తల్: తమ హక్కుల సాధన కోసం మహిళలు ఉద్యమించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయ అన్నారు. గురువారం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పని చేసే ప్రతి కార్మికురాలు పోరాడి తమ హక్కులను సాధించుకున్న రోజే లాఠీలకు, తూటాలకు ఎదురొడ్డి ధీరత్వంలో విజయపతాక ఎగిసిన రోజు మార్చి8 ప్రపంచ మహిళా లోకానికి ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో శారద, సౌజన్య, సంధ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయ

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తరలివెళ్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి జిల్లా నుంచి పలువురు జీపీ కార్మికులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వాహనశ్రేణికి జెండా ఊపి మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న జీపీ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేసి రూ.18వేలు అందించాలన్నారు. ప్రతి నెల 5వ తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. గ్రామాల్లో అవసరానికి తగ్గట్లు అదనపు సిబ్బందిని తీసుకోవాలని, జీపీ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, బాలయ్య, ఉసేన్, తిర్మలమ్మ, బస్సమ్మ, బాలరాజు, నర్సింహులు, వెంకటయ్య, నిరంజన్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నర్వ: మండల కేంద్రంలోని ఎస్‌వీఎం పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఆయా తరగతులకు బోధించారు. అనంతరం బహుమతులను అందించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈమేరకు క్రిష్టియన్‌పల్లిలో విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ప్రతిఒక్కరు బాధ్యతగా పర్యావరణాన్ని పరిరక్షించి, అడవులను కాపాడాలని, వాటి ద్వారా జీవవైవిధ్యం మెరుగుపడుతుందని అన్నారు. ప్రతిఒక్కరు తమ ఇంటి ఆవరణలో మొక్కలు నాటడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. చెట్లు లేకపోతే భూమి మీద మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతందన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు రాఘవేందర్, స్వరూప, నిరంజన్‌గౌడ్, నాగరాజు, బాలరాజు, వీణ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు, అధ్యాపకులు